☎ : 040-24754266
24754566
Fax No. : 040-24752966

SBISUHC
RIGHT IS MIGHT
RIGHT DUTY

# STATE BANK OF INDIA STAFF UNION HYDERABAD CIRCLE

STATE BANK OF INDIA BUILDINGS, BANK STREET, KOTI, HYDERABAD - 500 095.

## యూనియన్ డే – 20 జూన్ 2020

**2017** జనవరి 26న యూనియన్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయానుసారం ఆ ఏడాది నుండి ప్రతి ఏటా జూన్ 20 నాడు మనం యూనియన్ డేను నిర్వహిస్తూ వస్తున్న విషయం సభ్యులందరికీ విదితమే.

గతేడాది జూన్ 20న మన ప్రియతమ మహానేత కీర్తిశేషులు కా.వై.తారకనాథ్ స్మృత్యర్థం యూనియన్ డే సందర్భంగా హైదరాబాద్, అమరావతి సర్కిళ్లకు చెందిన అన్ని ప్రధాన కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను అమలు చేయడం జరిగింది. 2004 జూన్ 20న అప్పటి ఉమ్మడి యూనియన్, స్టేట్ బ్యాంక్ ఇండియా స్టాఫ్ యూనియన్, హైదరాబాద్ సర్కిల్‌ను విచ్ఛిన్నం చేయడానికి. కుట్రలు పన్నుతున్న విచ్ఛిన్నకర శక్తులను ప్రతిఘటించి యూనియన్ సమైక్యతను, సమగ్రతను పరిరక్షించడం కోసం నిర్విరామంగా పోరాడుతూ కదనరంగంలోనే కన్నుమూసిన కార్మికోద్యమ వీరయోధుడు కా॥తారకనాథ్‌గారి నిరుపమాన త్యాగనిరతిని ఈ సందర్భంలో మరోసారి స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. మన యూనియన్‌కు నారుపోసి త్యాగాల నీరు పోసి పెంచిన మన యూనియన్ అగ్రనేతలందరూ ఐక్యతే మన ఆయుధం అన్న విషయాన్ని నొక్కి చెప్పారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మన యూనియన్ సభ్యులందరూ గత ఐదు దశాబ్దాల కాలంలో ఒక్కతాటిపై నిలిచి యూనియన్ నాయకత్వాన్ని బలపరిచినందువల్లే మనం ఎన్నో ప్రయోజనాలు, హక్కులు సాధించుకోగలిగాం.

2019 ఆగస్ట్‌లో గుంటూరులో జరిగిన సర్వసభ్య సమావేశంలో మన యూనియన్ SBISU హైదరాబాద్ సర్కిల్, అమరావతి సర్కిళ్లుగా రెండుగా విభజింపబడిన తరువాత మనం ఈ సంవత్సరం మొదటిసారి తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన హైదరాబాద్ సర్కిల్‌లో యూనియన్‌డేను జరుపుకొంటున్నాం.

కోవిడ్–19 మహమ్మారి యావత్ ప్రపంచాన్ని కనీవినీ ఎరుగని సంక్షోభానికి గురిచేసింది. మానవాళి మొత్తం మృత్యుభయంతో విలవిలలాడిపోతుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో బ్యాంక్ ఉద్యోగులు ఖాతాదారులకు, సామాన్య ప్రజానీకానికి అత్యవసర బ్యాంకింగ్ సేవలను అందించడానికి కరోనా మహమ్మారితో పోరాడటానికి కరోనాయోధులుగా ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక సంస్కరణలు అమలుచేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాయి. కార్మిక చట్టాలకు ఇలాంటి సవరణలు తీసుకురావాలన్న ప్రతిపాదనలను బ్యాంకింగ్ రంగ ట్రేడ్ యూనియన్లు గత మూడు దశాబ్దాలుగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. ఐక్యతే నేటి తక్షణ ఆవశ్యకత, కార్మిక చట్టాలకు కార్మిక వ్యతిరేక సవరణలు తీసుకు రావడానికి ప్రభుత్వం చేస్తున్న ఈ కుటిల యత్నాలను తిప్పికొట్టడానికి సమైక్య, సంఘటిత పోరాటాలకు బ్యాంక్ ఉద్యోగులు సర్వసన్నద్ధంగా నిలవాలి. మన జాతీయస్థాయి నాయకత్వం ఎప్పుడు పిలుపిచ్చినా సుదీర్ఘ పోరాటాలకు మనమందరం కటిబద్ధులం కావాలి.

అపారమైన దూరదృష్టి కల్గిన మన యూనియన్ సంస్థాపక నేతలు మనకు విధి నిర్వహణలో అంకితభావం, సామాజిక స్పృహలాంటి ఉత్తమ విలువలతోపాటు మన మహత్తర ఉద్యమ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్, హైదరాబాద్ సర్కిల్ పట్ల చెక్కుచెదరని ఆదరాభిమానాలను అచంచల విశ్వాసాన్ని మన హృదయాల్లో సుస్థిరంగా నిలిపారు.

మన యూనియన్ డే ఉత్సవాలను 20 జూన్ 2020 నాడు భౌతికదూరం, మాస్కులు, చేతులకు తొడుగులాంటి స్వీయరక్షణ నిబంధనలను తు.చ.తప్పకుండా పాటిస్తూ ఘనంగా నిర్వహించాలనీ, ఈ సందర్భంలో కామ్రేడ్ వై.తారకనాథ్‌గారి పవిత్ర, స్ఫూర్తిదాయక స్మృతితో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా విస్తృతస్థాయిలో నిర్వహించాలని కోరుతున్నాం. ఈ ఏడాది కరోనా మహమ్మారి విలయతాండవాన్ని దృష్టిలో ఉంచుకొని వృద్ధాశ్రమాలు, అనాథశరణాలయాలు లాంటి నిస్సహాయ స్థితిలో ఉన్న వర్గాల ప్రజలను ఆదుకోడానికి వినూత్న పద్ధతుల్లో సహాయక చర్యలు చేపట్టాలని, విరాళాలు సేకరించాలని సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

“వైయక్తికంగా మనం ఎంతైనా కృషి చేయవచ్చు
కానీ సమైక్య కృషి ద్వారానే సత్ఫలితాలు సాధ్యం”.

విప్లవాభివందనాలతో

**ఆర్.శ్రీరాం**

ప్రధాన కార్యదర్శి

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జిందాబాద్**

**ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ జిందాబాద్**

**నేషనల్ కన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ జిందాబాద్**